సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 14 । డిసెంబర్ । 2023



వాళ్లేం పాపం చేశారు..?

భద్రాచలం ఏజెన్సీలో ఆర్టీసీ సర్వీసులు లేక పోవడంతో మహిళలు మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకోలేకపోతున్నారు. 8లో



మిర్చి కళకళ..

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చికి అధిక ధర పలుకుతుండగా, పత్తి ధర రోజురోజుకు పడిపోతోంది. 10లో

గరిష్టం / కనిష్టం
28° / 17°

వాతావరణం

జిల్లాలో గురువారం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. రాత్రి వేళ తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

కొత్త కొత్తగా..!

రాష్ట్రంలో ఇటీవల కొత్త ప్రభుత్వం కొలువుదీరగా, తొలి అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ చేరుకున్నారు. కొత్త ప్రభుత్వానికి తోడు కొత్తగా ఎన్నికైన నేపథ్యాన నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించేందుకు జాబితా సిద్ధం చేసుకున్నారు. పలు ప్రాధాన్యత అంశాలపై అసెంబ్లీలో చర్చ జరగనుండడంతో తమకు అవకాశం వస్తే నియోజకవర్గంలోని సమస్యలను ప్రస్తావించేందుకు ఎమ్మెల్యేలు సన్నద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లాలో పలు ప్రధాన సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నందున కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మోక్షం కలుగుతుందని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- ప్రాధాన్యత అంశాలపై చర్చకు అవకాశం
- సమస్యల జాబితాతో వెళ్లిన ఎమ్మెల్యేలు
- పెండింగ్ సమస్యలు ప్రస్తావించేందుకు సన్నద్ధం



రైతుల సమస్యలు ప్రస్తావిస్తా..



బూర్గంపాడు: మూడో సారి ఎమ్మెల్యేగా అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానుండడం సంతోషంగా ఉంది. అధికార పార్టీ ఎమ్మెల్యేనే అయిన ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను. ఈ అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడే అవకాశం వస్తే ఇటీవల తుపాన్‌తో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరతాను. అలాగే, పినపాక నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేలా ప్రభుత్వ సహకారాన్ని కోరతా.

–పాయం వెంకటేశ్వర్లు, పినపాక ఎమ్మెల్యే

బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చాలని కోరతా...



వైరా : వైరా రిజర్వాయర్ చరిత్రాత్మకంగా నిలుస్తుండగా, సాగు, తాగునీరు సరఫరా చేయడమే కాక ఐదు మండలాల మత్స్యకారులకు జీవనోపాధి లభిస్తోంది. నిత్యం రిజర్వాయర్‌లో నీరు ఉండేందుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చాలని ప్రభుత్వాన్ని కోరతా. అలాగే, చివరి భూములకు సాగునీరు అందేలా ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయాలని విన్నవిస్తా. ఇవేకాక వైరాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆస్పత్రి 100 పడకలకు అప్‌గ్రేడ్‌కు నిధులు మంజూరు చేయాలని కోరడంతో పాటు చిరువ్యాపారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.

– మాలోతు రాందాస్ నాయక్, వైరా ఎమ్మెల్యే

ప్రధాన సమస్యల్లో కొన్ని...

- ఇటీవల మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికి వచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వరి, మొక్కజొన్న, వేరుశెనగ, మిరప, పత్తి పంటలపై తుపాన్ ప్రభావం చూపింది. 49,619 మంది రైతులకు చెందిన 73,089 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, రూ.700 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు అంచనా. పంట నష్టం వివరాలు రెండు జిల్లాల నుంచి ఇప్పటికే ప్రభుత్వానికి అందినందున పరిహారం ప్రకటిస్తే కొంతైనా నష్టం పూడుతుందని రైతులు భావిస్తున్నారు.
- ఖమ్మం జిల్లాలో ఈ వానాకాలం వరకు 3,62,293 మంది రైతులకు బ్యాంకులు రూ.4,123.37 కోట్ల పంట రుణాలు ఇచ్చాయి. కొత్త ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని ప్రకటించింది. అయితే కటాఫ్ తేదీని ఎలా ఖరారు చేస్తారు, ఏ మేరకు రుణాలు మాఫీ అవుతాయోనని రైతులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వంలో రూ.లక్ష రుణ మాఫీకి సంబంధించి ఇంకా రూ.150 కోట్ల మేర పెండింగ్ ఉంది.
- ఉమ్మడి జిల్లాలో 7.50 లక్షల ఎకరాలకు సాగు నీరు, 320 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో సీతారామ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు 2016 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు రూ.5వేల కోట్లకు పైగా నిధులు వెచ్చించినా ఒక్క ఎకరాకు నీరు అందలేదు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పంప్‌హౌజ్‌ల నిర్మాణం జరిగింది. బ్యారేజీ నిర్మాణ పనులు గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు కారణంగా నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టులో భాగమైన ప్రధాన కాల్వలు, మైనర్ కాల్వల పనుల్లో అంతులేని జాప్యం జరుగుతోంది.
- ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పాటైనందున దరఖాస్తులకు మోక్షం కలుగుతుందా అని నిరుపేదలు ఎదురుచూస్తున్నారు. కాగా, దరఖాస్తుదారుల్లో అర్హులను తేల్చాల్సి ఉంది.
- ఉమ్మడి జిల్లాలో 2,78,619లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇవ్వాలని 1,01,828 దరఖాస్తులు అందాయి. ఇందులో 1,56,589 ఎకరాలకు సంబంధించి 63,728 మంది గిరిజన కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేశారు. ఇక మిగిలిన గిరిజనులు, గిరిజనేతరులు పట్టాల కోసం ఎదురుచూస్తున్నారు.
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. తల్లాడ నుంచి ఏన్కూరు, జూలూరుపాడు, కొత్తగూడెం వరకు అలాగే ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెంతో పాటు సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట రోడ్లు అధ్వానంగా మారాయి. భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉన్న చోట కల్వర్టులు కుంగాయి. ఈ రోడ్లకు మరమ్మతులు చేయడం లేదా కొత్తగా రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు నిధులు విడుదల చేయాలి.

సీతారామ ప్రాజెక్టుపై మాట్లాడతా



ఇల్లెందు: ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే అవకాశమున్న సీతారామ ప్రాజెక్టు అంశాన్ని ప్రస్తావిస్తా. గత ప్రభుత్వం శంకుస్థాపన చేసి వదిలేసిన ఈ ప్రాజెక్టును సాధించాల్సి ఉంది. గోదావరి నీళ్లు వస్తే రెండు పంటలు పండుతాయి. ఇక బొగ్గు బావులకు పుట్టినిల్లయిన ఇల్లెందులో కొత్త గనులు ప్రారంభించాలని కోరతాను. నూతన మండలాల ఏర్పాటు ఆవశ్యకతను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.

– కోరం కనకయ్య, ఇల్లెందు ఎమ్మెల్యే

నూతన గనులపై గళం వినిపిస్తా..



సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రజలు ఎదుర్కొంటున్న తాగు నీరు, ట్రాఫిక్, అండర్ బ్రిడ్జి సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. అలాగే, కొత్తగూడెం ఏరియాలో నూతన భూగర్భ గనుల ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తా. దీంతో పాటు సింగరేణి కాలనీల్లో సమస్యలను కూడా ప్రస్తావిస్తాను. పాల్వంచలోని కేటీపీఎస్ ఎనిమిదో ప్లాంట్ ఏర్పాటు ఆవశ్యకతను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా సాధించేందుకు కృషి చేస్తాను.

–కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

ప్రభుత్వం దృష్టికి పంటనష్టం



సత్తుపల్లి: మిచాంగ్ తుపాన్‌తో నియోజకవర్గంలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అసెంబ్లీలో కోరతాను. రైతులకు ప్రభుత్వం న్యాయం చేసేలా కృషి చేస్తా. పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాలతో పాటు ఆదివాసీ, గిరిజనుల సమస్యలను వివరిస్తా. ఇప్పటికే సత్తుపల్లి నియోజకవర్గంలోని సమస్యలపై అధ్యయనం చేస్తున్నాం. ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు నా వంతుగా కృషిచేస్తా. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఇప్పటికే మహాలక్ష్మి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వచ్చిన నేపథ్యాన ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతాను.

–డాక్టర్ మట్టా రాగమయి, సత్తుపల్లి ఎమ్మెల్యే

- కొత్త రేషన్ కార్డుల కోసం గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తులు అందాయి. రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో నిరుపేదలు పలువురికి లబ్ధి చేకూరడం లేదు. గతంలో అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను తేల్చడంతో పాటు కొత్తగా దరఖాస్తులు స్వీకరించాలన్న డిమాండ్ ఉంది.
- వలస ఆదివాసీల సమస్య ఏటా పునరావృతమవుతోంది. ఉమ్మడి జిల్లాలో 20వేల మందికి పైగా వలస ఆదివాసీలు ఉన్నారు. ఆదివాసీగూడెంల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం వస్తే గూడేల నుంచి ఆదివాసీలు బయటకు రాని పరిస్థితి ఉంటోంది.

న్యూస్‌రీల్

15న దివ్యాంగుల ఆటల పోటీలు

సింగరేణి(కొత్తగూడెం): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న ప్రకాశం స్టేడియంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేల్పుల విజేత తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ జూనియర్ విభాగంలో 10–16 సంవత్సరాలు, సీనియర్ విభాగంలో 17–35 సంవత్సరాల వారికి రన్నింగ్, షాట్‌పుట్, చెస్, జావెలిన్ త్రో పోటీలు బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఇతర వివరాలకు 83310 06010 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మూడు రోజులుగా విమానం హల్‌చల్

సుజాతనగర్: మూడు రోజులుగా ఆకాశంలో ఓ చిన్న విమానం హల్‌చల్ చేస్తోంది. రోజులో సుమారు నాలుగైదు పర్యాయాలు చక్కర్లు కొడుతోంది. జూలూరుపాడు వైపు నుంచి సుజాతనగర్ మీదుగా కొత్తగూడెం వైపు వెళ్లి మళ్లీ తిరిగి వస్తోంది. ఇళ్ల పైనుంచి చాలా తక్కువ ఎత్తులోనే విమానం ఎగురుతుండటంతో అందరూ ఆసక్తిగా వీక్షిస్తున్నారు. ఇంతకీ ఈ విమానం ఎవరిదీ.. ఎందుకు ఇన్నిసార్లు వెళుతోంది? సీతారామ కెనాల్‌కు సంబంధించినదో.. గూగుల్ మ్యాప్‌నకు సంబంధించినదోననే చర్చ సాగుతోంది. విమానం రాకపోకలపై స్థానిక పోలీసులను వాకబు చేయగా తమకేమీ సమాచారం లేదని తెలిపారు.

డీసీసీబీని సందర్శించిన ‘వ్యవసాయ’ విద్యార్థులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్ అనూష

అశ్వారావుపేటరూరల్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థుల బృందం బుధవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ)ను సందర్శించింది. కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులు క్షేత్ర సందర్శనలో భాగంగా బ్యాంకు లావాదేవీలు, కిసాన్ క్రెడిట్ కార్డు, వ్యవసాయ రుణాలు, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్, డిపాజిట్లు, టర్న్ ఓవర్, పెండింగ్ బకాయి తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు, ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకులకు ఉండే సమన్వయంతోపాటు ఇతర అంశాలను డీసీసీబీ మేనేజర్ ఆర్.అనూష, ఫీల్డ్ ఆఫీసర్ రామ్ సుందర్ వివరించారు. కళాశాల ప్రొఫెసర్ కృష్ణతేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో రోజుకు పోస్టల్ సమ్మె



ఆందోళన చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): సమస్యలు పరిష్కరించాలని తపాలా శాఖ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరింది. కొత్తగూడెం పోస్టాఫీస్ ఎదుట ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో పలువురు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జీడీఎస్, పీజేఏసీ ఖమ్మం డివిజన్ నాయకుడు టి. విజయరాజు మాట్లాడుతూ తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై 2018 కమలేష్ చంద్ర కమిటీ సమర్పించిన నివేదికలో సానుకూల అంశాలు నెరవేరుస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఐదేళ్లు గడిచినా అమలు చేయడంలేదని ఆరోపించారు. సీనియారిటీ, ఇంక్రిమెంట్లు, గ్రాట్యుటీ, మెడికల్ బెనిఫిట్స్, సివిల్ సర్వెంట్ హోదా తదితర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి గ్రామీణ డాక్ సేవక్‌ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ సంఘాల నాయకులు ఏ.ఏ. ఖాన్, ఎం.వెంకటేశ్వర్లు, వాహెబ్, షేక్ ఖలీల్, వెంకటకృష్ణ, వినయ్ సుధీర్, శ్రీను, లక్ష్మీ భారతి, సాహిత్య, రిజ్వాన పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ: ఏఐజీడీఎస్‌యూ, ఎన్‌యూజీడీఎస్ యూనియన్ల పిలుపు మేరకు బుధవారం ఉద్యోగులు విధులు బహిష్కరించి పోస్టాఫీస్ ముందు నిరవధిక సమ్మె కొనసాగించారు. యూనియన్ భద్రాచలం బ్రాంచ్ సెక్రటరీ బి.ఎల్లారావు హాజరై మాట్లాడారు. ఉద్యోగులు భూషణం, సరిత, నందిని, అనుక్, ప్రమోద్ రాజ, ఫరిద తదితరులు పాల్గొన్నారు.

మత్స్య అవతారంలో రామయ్య



బేడా మండపంలో ఆళ్వార్లతో శ్రీసీతారామచంద్ర స్వామివారు

- తిలకించి పులకించిన భక్తజనులు
- వైభవోపేతంగా అధ్యయనోత్సవాలు ప్రారంభం
- నేడు కూర్మావతారంలో దర్శనం

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి దివ్యక్షేత్రంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు బుధవారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు రామయ్య మత్స్య అవతారంలో దర్శనమివ్వగా, తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంతో పులకించారు. తొలుత అధ్యయనోత్సవాలలో భాగంగా ఆలయంలోని గర్భగుడిలో మూలమూర్తుల వద్ద ఉత్సవాల నిర్వహణకు అధ్వర్యులు అనుజ్ఞ తీసుకున్నారు. స్వామివారి ఉత్సవమూర్తులను, ఆళ్వార్లను బేడా మండపానికి మేళతాళాల మధ్య తీసుకొచ్చి వేదికపై కొలువుదీర్చి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ప్రబంధాలను, సేవాకాలం నివేదించారు. ప్రత్యేక ఆరాధన, విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం సమర్పించారు. వైదిక పరిపాలనా సిబ్బందికి దీక్షా వస్త్రాలను అందచేశారు.

ఆళ్వార్లతో కొలువుదీర్చి..

వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారు మత్స్యావతార రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మత్స్యాలంకరణలో స్వామివారిని కొద్దిసేపు బేడా మండపంలో ఆళ్వార్లతో కొలువుదీర్చి పూజలు జరిపారు. అనంతరం స్వామివారిని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల కోలాటాల నడుమ ఊరేగింపుగా తీసుకొని వెళ్లి మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. మత్స్యావతార రూపంలో కొలువైన స్వామి వారిని దర్శించుకున్న భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ జరిపి ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సంగీత కళాకారులు ఆలపించిన కీర్తనలు, హరికథలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, స్థానాచార్యులు స్థలశాయి, వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఈఓ రమాదేవి తదితరులు

నేడు కూర్మావతారంలో..

అధ్యయనోత్సవాలలో భాగంగా శ్రీ ఆది మహావిష్ణువు స్వరూపమైన శ్రీ సీతారామ చంద్రస్వామి గురువారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దేవతలు, రాక్షసులు మంథర పర్వతాన్ని కవ్వంగా, వాసుకి అనే పామును తాడుగా చేసుకొని, అమృతం కోసం క్షీరసాగరాన్ని చిలుకుతారు. ఏ ఆధారం లేక మంథగిరి మునిగిపోగా, దేవతలు, రాక్షసుల ప్రార్థనపై శ్రీహరి కూర్మావతారాన్ని ధరించి మునిగిపోయిన మంథర పర్వతాన్ని తన వీపున నిలుపుకుని పైకెత్తి సహాయపడ్డాడు. ఈ అవతారంలో స్వామివారిని దర్శించుకుంటే శని గ్రహ సంబంధమైన దోషాలు తొలగుతాయని పండితులు చెబుతున్నారు.

మాతా శిశు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): మాతా శిశు ఆరోగ్య పరిరక్షణకు వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం వైద్య, ఆరోగ్యశాఖాధికారులతో మాతృమరణాలపై సమీక్ష నిర్వహించి కేసు షీట్లను పరిశీలించారు. పర్ణశాల, దుమ్ముగూడెం, అశ్వారావుపేట ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన మరణాలకు కారణాలను సంబంధిత వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గర్భిణుల ఆరోగ్యంపై పర్యవేక్షణ చేయాలని చెప్పారు. హైరిస్క్ కేసుల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రసవానికి ఆస్పత్రికి వచ్చీ రాగానే వైద్యసేవలు అందించాలని, సీరియస్ అయిన తర్వాత ఇతర ఆస్పత్రులకు సిఫారసు చేయడం సరికాదని అన్నారు. వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వల్ల మాతృమరణాలు జరిగితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. గర్భిణులను అత్యవసర సమయంలో ఆస్పత్రులకు చేర్చేందుకు ఆటోలు, ప్రైవేట్ అంబులెన్స్‌లను వినియోగించుకోవాలని సూచించారు. పాల్వంచ, భద్రాచలం ఏరియా ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు శిరీష, రవిబాబు, రాజ్‌కుమార్, సుకృత, రామకృష్ణ, చైతన్య, సరళ, సింధు తదితరులు పాల్గొన్నారు.

జననం వరకు పర్యవేక్షించాలి

గర్భిణులు ఆరోగ్యవంతమైన చిన్నారులకు జన్మనిచ్చే వరకు పర్యవేక్షించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సేవలపై సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పోషణలోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలో 11 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 7,436 మంది గర్భిణులు, 7,181 మంది బాలింతలకు ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా బలవర్ధక ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల నమోదు ప్రక్రియ పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణులు, బాలింతలకు రేషన్ అందకపోతే సీడీపీఓలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు, మరుగుదొడ్ల నిర్మాణానికి 2018లో నిధులు కేటాయిస్తే, ఇంకా పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయారని టీఎస్ఈడబ్ల్యూ ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. పోషన్‌వాటికలో చేపట్టిన 55 అంగన్‌వాడీ కేంద్రాలపై డాక్యుమెంటేషన్ నివేదికలు అందజేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్షపు నీటిసంరక్షణకు ఇంకుడుగుంతలు నిర్మించాలన్నారు. జూలూరుపాడు ఎంపీడీఓతో ఫోన్‌లో మాట్లాడి వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా శిశు, మహిళా సంక్షేమాధికారి విజేత అంగన్‌వాడీ కేంద్రాల కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

సైన్స్‌ఫేర్ పిలుస్తోంది..

- ఈ నెల 19 నుంచి వైజ్ఞానిక ప్రదర్శన
- పాల్వంచలో మూడురోజులపాటు సందడి
- విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు విద్యాశాఖ కృషి

కొత్తగూడెంఅర్బన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విజ్ఞానశాస్త్రం పట్ల అభిరుచి పెంపొందించేందుకు, భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ ఏటా వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్‌ఫేర్) నిర్వహిస్తోంది. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేయూతను అందిస్తున్నాయి. కాగా ఈ నెల 19 నుంచి 21 వరకు పాల్వంచలో జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ నిర్వహించనున్నారు. ఇప్పటికే విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. 2023–24 సైన్స్‌ఫేర్ పోటీలను అట్టహాసంగా నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుండగా, పాఠశాలల్లో ప్రాజెక్టుల సందడి మొదలైంది. గతేడాది సైన్స్‌ఫేర్ ఇల్లెందులో నిర్వహించగా, 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. 510 ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. జూనియర్, సీనియర్, ఐటీడీఏ విభాగాల నుంచి మొత్తం 21 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఇన్‌స్పైర్ పోటీలు కూడా అక్కడే నిర్వహించగా, 7 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి.

సమాజం కోసం శాస్త్ర–సాంకేతిక రంగం..

2023–24 సైన్స్‌ఫేర్‌లో ప్రధాన అంశం ‘సమాజం కోసం శాస్త్ర–సాంకేతిక రంగం’, ఉప అంశాలు ఆరోగ్యం, వ్యవసాయం, సమాచారం–రవాణా, జీవన విధానం–పర్యావరణం, కంప్యూటేషన్ థింకింగ్‌గా పేర్కొన్నారు. పాల్వంచలోని డీఏవీ పాఠశాలలో వేడుక నిర్వహించనుండగా, సీనియర్ విభాగంలో 9 నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు, జూనియర్ విభాగంలో 6 నుంచి 8వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనాల్సి ఉంటుంది. ఒక ఎగ్జిబిట్‌కు ఇద్దరికి మించి విద్యార్థులు పాల్గొనొద్దని, ప్రతి పాఠశాల నుంచి తప్పని సరిగా 3 నుంచి 5 అంశాలపై ప్రదర్శన ఇవ్వాలని జిల్లా విద్యాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పాఠశాల నుంచీ ఒక గైడ్ టీచర్ మాత్రమే హాజరు కావాలని చెబుతున్నారు. ఐటీడీఏ పాఠశాలల ఎగ్జిబిట్లకు ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, గైడ్ టీచర్లకు భోజనం, రాత్రి బస వసతి సౌకర్యాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శీతాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని దూరప్రాంతాల నుంచి హాజరయ్యే విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వెటర్లు, దుప్పట్లు తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. సైన్స్‌ఫేర్‌లో ఈ ఏడాది ‘మిల్లెట్స్ ఫర్ హెల్త్ అండ్ సస్టైనబుల్ ప్లానెట్’ అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నారు. క్విజ్, వ్యాసరచన పోటీలు, శాస్త్రవేత్తలతో ఉపన్యాసాలు ఏర్పాటు చేయనున్నారు. సైన్స్ ఫేర్ విజయవంతానికి రిసెప్షన్ కమిటీ, క్రమశిక్షణ కమిటీ, కల్చరల్ కమిటీ, ఫుడ్ కమిటీలతోపాటు మరో 11 కమిటీలను ఏర్పాటు చేసినట్లు విద్యాధికారులు తెలిపారు.



సైన్స్‌ఫేర్‌లో ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

ముమ్మరంగా ఏర్పాట్లు



పాల్వంచ డీఏవీ పాఠశాలలో మూడు రోజులపాటు సైన్స్ ఫేర్ సందడి చేయనుంది. ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బాలబాలికలకు వేర్వేరుగా వసతి సౌకర్యం, భోజన ఏర్పాట్లు చేస్తున్నాం. గతేడాది కంటే ఈ సారి ఎక్కువ మంది విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉంది.

–ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాధికారి

క్లుప్తంగా

ఆ యూనిట్‌ను అందుబాటులోకి తేవాలి

- సీఎండీ, డైరెక్టర్లను కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు



ఎన్‌ఎండీసీ సీఎండీ అమిత్ ముఖర్జీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: ఎన్‌ఎండీసీ పాల్వంచ యూనిట్ కర్మాగారాన్ని అందుబాటులోకి తీసుకు రావాలని ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘం నాయకులు బాలునాయక్, కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో సీఎండీ అమిత్ ముఖర్జీ, డైరెక్టర్ (ప్రొడక్షన్) దిలీప్‌కుమార్ మహంతి, ఈడీ (పర్సనల్) సత్యేంద్రరాయ్‌లను కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాల్వంచ యూనిట్‌లో ఉన్న సౌకర్యాలు వినియోగించుకుని కర్మాగారం విస్తరణకు కృషి చేయాలని, కంపెనీ అభివృద్ధి కోసం పాల్వంచ యూనిట్‌ను సందర్శించాలని కోరారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

ఎమ్మెల్యే కోరంను కలిసిన డీపీఓ



ఎమ్మెల్యే కనకయ్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీపీఓ లక్ష్మీరమాకాంత్

ఇల్లెందురూరల్: జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్ బుధవారం ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన కోరం కనకయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఆ దిశగా పంచాయతీ కార్యదర్శులు శ్రమించేలా తగు సూచనలివ్వాలని డీపీఓను కోరారు. కార్యక్రమంలో డీపీఓ కార్యాలయ సిబ్బంది రమణ, ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శి రజినీకాంత్ పాల్గొన్నారు.

లింక్ క్లిక్ చేస్తే.. నగదు స్వాహా

పాల్వంచ: అపరిచిత నంబర్ నుంచి వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయగా అకస్మాత్తుగా ఖాతాలోని నగదు మాయమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని కరకవాగుకు చెందిన కేటీపీఎస్ ఉద్యోగి వాంకుడోతు నరేశ్ ఈ నెల 2వ తేదీన విధులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. అతడి 12 ఏళ్ల కుమారుడు తన మొబైల్‌లో గేమ్స్ ఆడుతుండగా ఓ అపరిచిత నంబర్ నుంచి లింక్ రావడంతో దానిని క్లిక్ చేయగా ఓటీపీ నంబర్ వచ్చింది. వెంటనే ఓటీపీ నంబర్ కూడా ఎంటర్ చేయడంతో ఖాతాలోని రూ.40,500 నగదు మాయమైంది. దీంతో మోసానికి గురయ్యామని గుర్తించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ డి.రాఘవయ్య కేసు నమోదు చేశారు.

ఊట్లపల్లిలో చోరీ

అశ్వారావుపేటరూరల్: గుర్తు తెలియని దుండగులు ఓ ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన బూదురి సత్యనారాయణ సోమవారం రాత్రి తన ఇంటి తలుపులు వేయకుండానే నిద్రపోయాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లో ఉన్న బీరువాను తెరిచి దాంట్లో ఉన్న రూ.50 వేల నగదుతోపాటు సుమారు 60 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. కాగా, క్లూస్ టీం ఇంటిని పరిశీలించిందని, చోరీకి గురైన ఆభరణాల విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని ఆయన చెప్పారు.

పల్సర్ బైక్ చోరీ

పాల్వంచ: ఇంటి ముందు నిలిపి ఉంచిన పల్సర్ బైక్ చోరీకి గురికాగా, పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బొల్లేరుగూడెంలోని స్వాతి స్కూల్ రోడ్‌లో బోడ కుమార్ తాను అద్దెకు ఉంటున్న ఇంటి ముందు పల్సర్ బైక్‌ను ఈ నెల 10వ తేదీన పార్క్ చేశాడు. మరుసటి రోజు తెల్లవారుజామున చూడగా కనపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించాడు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్ పైకి ఎక్కిన టిప్పర్

పెనుబల్లి: పెనుబల్లి శివార్లలో రహదారి డివైడర్‌పైకి బుధవారం తెల్లవారుజామున టిప్పర్ లారీ ఎక్కడంతో డివైడర్, రెయిలింగ్ ధ్వంసమయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా టిప్పర్‌ను నడపడంతో డివైడర్‌పై ఉన్న రెయిలింగ్ సుమారు 60 అడుగల మేర ధ్వంసమైనట్లు స్థానికులు తెలిపారు. టిప్పర్ల డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మరిన్ని ప్రమాదాలు జరగకముందే అధికారులు వారిని అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వాళ్లేం పాపం చేశారు..?

- గిరి పల్లెలకు చేరని 'మహాలక్ష్మి'
- రహదారులు బాగున్నా తిరగని ఆర్టీసీ బస్సులు
- ఉచిత ప్రయాణానికి దూరమవుతున్న ఆదివాసీ మహిళలు
- గతంలో తిరిగిన రూట్లల్లోనైనా బస్సులు నడపాలని వినతి



భద్రాచలం బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న మహిళలు

భద్రాచలంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తూ ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించింది. ఈ క్రమంలో మహిళల నుంచి భారీగా స్పందన వస్తోంది. ఆర్టీసీ సేవలను మహిళలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినా.. పూర్తిస్థాయిలో అందరి దరిచేరడం లేదు. భద్రాచలం ఏజెన్సీలోని పలు ప్రాంతాలకు రహదారులు బాగున్నా బస్సులు నడపకపోవడంతో లబ్ధి పొందే అవకాశం కోల్పోతున్నారు. డివిజన్‌లోని అనేక గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల మందికి పైగా మహిళలు, విద్యార్థినులు, ఆటోలు, ద్విచక్రవాహనాల ద్వారా ప్రయాణం సాగిస్తుంటారు. ఆయా గ్రామాలకు సైతం ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపితే రవాణా ఖర్చులు మిగులుతాయని వారు కోరుతున్నారు. రోడ్డు మార్గాలు సక్రమంగా ఉన్న రహదారుల్లోనైనా ఆర్టీసీ బస్సులను నడిపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సరిహద్దు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గతంలో బస్సులు తిరిగినా..

భద్రాచలం డిపో నుంచి గతంలో అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిచేవి. మారుమూల గ్రామాలకు సైతం ఆర్టీసీ సేవలను అప్పటి అధికారులు విస్తరించారు. రోడ్లు సరిగా లేకపోయిన ప్రతిరోజు కనీసం రెండు ట్రిప్పులు బస్సులు తిప్పేవారు. కాలక్రమేణా ఆటోల సంఖ్య పెరగడం, సమయానికి బస్సులను తిప్పడంలో ఆర్టీసీ అధికారులు విఫలం కావడంతో ప్రజలు పూర్తిగా ఆటోల వైపే మొగ్గు చూపారు. మినీ బస్సులను తిప్పినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో ఆర్టీసీ అధికారులు పూర్తిగా ఆయా రూట్లలో తిప్పే బస్సులను రద్దు చేశారు. మళ్లీ బస్సులను తిప్పాలని ఆయా గ్రామ ప్రజల నుంచి వినతులు వచ్చినా ఆర్టీసీ అధికారులు పెద్దగా స్పందించలేదనే విమర్శలు ఉన్నాయి.

గతంలో బస్సులు నడిచిన రూట్లు

- భద్రాచలం నుంచి ఎటపాకలోని పాలిటెక్నిక్ కళాశాల మీదుగా చెరుపల్లి, మారాయిగూడెం, ఆర్లగూడెం నుంచి దుమ్ముగూడెం మండల కేంద్రమైన లక్ష్మీనగరం వరకు బస్సులు నడిచేవి.
- భద్రాచలం నుంచి ఆర్టీసీ బస్సు నరసాపురం, సింగారం, ఆర్లగూడెం నుంచి దుమ్ముగూడెం మండల కేంద్రమైన లక్ష్మీనగరం వరకు వెళ్లి తిరిగి భద్రాచలం వచ్చేది.
- చర్ల మండలంలోని కలివేరు, మిడిసిలేరు మీదుగా దోసిళ్లపల్లికి వెళ్లి, అక్కడి నుంచి చర్ల చేరుకునేది.
- భద్రాచలం నుంచి చర్ల మండలంలోని పూసుగుప్ప, తిప్పాపురం గ్రామాలకు సైతం చాన్నాళ్లు ఆర్టీసీ బస్సులు నడిపారు.

అవకాశం ఉన్నప్పటికీ..

మహాలక్ష్మి పథకంతో మహిళల నుంచి విశేష స్పందన వస్తుండటంతో ఏజెన్సీలోని దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులను తిప్పితే లాభం చేకూరే అవకాశాలు మెండుగా ఉన్నాయి. భద్రాచలం నుంచి చెరుపల్లి, మారాయిగూడె మీదుగా ఆర్లగూడెం లక్ష్మీనగరం వరకు, పెద్ద బండిరేవు నుంచి కుర్నపల్లి మీదుగా ఆర్.కొత్తగూడెం వరకు బస్సులను తిప్పవచ్చు. అలాగే, కలివేరు నుంచి మిడిసిలేరు, దోసిళ్లపల్లి మీదుగా చర్ల వరకు బస్సులను నడపవచ్చు. ఈ రూట్లలో పల్లెటూర్లు అధికంగా ఉండటంతో ఆర్టీసీ బస్సులకు ఆదరణ పెరుగుతుందని, ఆ దిశగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మారాయిగూడెం నుంచి లక్ష్మీనగరం వరకు ఉన్న డబుల్ రోడ్డు

ఆర్టీసీ బస్సులు నడపాలి



గతంలో మా ఊరికి ఆర్టీసీ బస్సులు వచ్చివెళ్లగా, చార్జీలు తక్కువగానే ఉండేవి. ఆ తర్వాత బస్సులు రాకపోవడంతో ఆటోలకు అధిక చార్జీ చెల్లించి ప్రయాణించాల్సి వస్తోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మేము సద్వినియోగం చేసుకోవాలంటే బస్సులు తిప్పాలి.

–సొందె చిన్నక్క, మారాయిగూడెం, దుమ్ముగూడెం మండలం

ఆర్థిక భారం తగ్గుతుంది



ప్రతిరోజు కళాశాలకు దుమ్ముగూడెంకు ఆటోలో వెళ్లాల్సి వస్తోంది. దీంతో నెలకు రూ.1,500కు పైగా ఖర్చు అవుతోంది. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పుడు మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించారు. మా గ్రామానికి బస్సు నడిపితే ఆ నగదు మిగిలి మా తల్లిదండ్రులపై భారం తగ్గుతుంది.

–కొర్స కవిత, ఇంటర్, ఆర్లగూడెం, దుమ్ముగూడెం మండలం

ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి



మా ఊరికి రెండేళ్ల కిందట రహదారి నిర్మించగా, అధికారులకు అనేక సార్లు వినతులు అందించాం. రోడ్డు బాగా లేనప్పుడు కాకున్నా, ఆ తర్వాతైనా బస్సులు నడపాలని కోరాం. 'మహాలక్ష్మి' ద్వారా మా గ్రామ మహిళలకు లబ్ధి జరిగేలా ప్రజాప్రతినిధుల చొరవ తీసుకోవాలి.

–సోడి కృష్ణవేణి, కుర్నపల్లి, చర్ల మండలం

బస్సు సౌకర్యం కల్పించాలి



మా గ్రామం నుంచి అనేక మంది మహిళలు ప్రతిరోజు చర్ల, భద్రాచలం పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. అందులో విద్యార్థులు అధికంగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నందున ఇప్పుడైనా బస్సు సౌకర్యం కల్పించాలి.

–పర్శిక బుచ్చమ్మ, మిడిసిలేరు, చర్ల మండలం

క్రీడాకారులను అభినందించిన కలెక్టర్



కలెక్టర్‌తో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): 67వ జాతీయస్థాయి పాఠశాలల క్రీడలకు ఎంపికైన జిల్లాకు చెందిన అథ్లెటిక్స్, కరాటే క్రీడాకారులను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల బుధవారం అభినందించారు. అండర్–14 విభాగంలో సీహెచ్ వేదశ్రీ, డి.మధుప్రియ డిస్కస్ త్రోలో.. ఎం.శ్రీవిద్యధార లాంగ్‌జంప్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–17లో 400 మీటర్ల విభాగంలో బి.ఆశశ్రీ, హామర్‌త్రోలో బి.పల్లవి, 100 మీటర్ల హార్డిల్స్‌లో ఎస్‌కే అఫ్రీన్ జాతీయస్థాయికి ఎంపికయ్యారు. అండర్–19లో 3 కి.మీ పరుగులో ఎం.సంగీత, డిస్కస్‌త్రో, షాట్‌పుట్‌లో ఎస్‌కే రియాజ్‌పాషా, 400, 200 మీటర్ల పరుగులో జె.వరుణ్, 1500 మీటర్లు, 3 కి.మీలో ఎం.అఖిల్, 6 కి.మీలో ఎం.ప్రేమ్‌కుమార్ జాతీయస్థాయికి ఎంపికయ్యారు. అండర్–17 విభాగంలో సాయివరుణ్ కరాటేలో జాతీయస్థాయికి ఎంపికయ్యారు. జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 16 నుంచి లక్నోలో, కరాటే జాతీయస్థాయి పోటీలు ఈ నెల 15 నుంచి ఢిల్లీలో జరగనున్నాయి. జాతీయస్థాయికి జిల్లా క్రీడాకారులు ఎంపిక కావడంపై సర్కిల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహక కార్యదర్శి టి.స్టెల్లా, సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులు, కరాటే కోచ్ ఇంద్రాల శ్రీధర్‌ను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా శాఖాధికారి ఎం.పరంధామ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముక్కోటికి రండి!

- దేవాదాయ శాఖ మంత్రిని ఆహ్వానించిన భద్రాద్రి ఈఓ



మంత్రిని సన్మానించిన ఈఓ, అధికారులు, అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా నిర్వహించే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి రావాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆలయ ఈఓ రమాదేవి ఆహ్వానించారు. ఈసందర్భంగా బుధవారం ఆమె హైదరాబాద్‌లో మంత్రిని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. అలాగే, ఆలయ ఆధ్వర్యాన రూపొందించిన 2024 క్యాలెండర్‌ను మంత్రి చేతుల మీదుగా అవిష్కరించారు. కాగా, ఈ క్యాలెండర్ దేవస్థానం స్టాల్‌లో గురువారం నుంచి అందుబాటులో ఉంటుందని ఈఓ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

సాక్షి ఎఫెక్ట్..



ఆర్థిక సాయం చేస్తున్న అయ్యప్ప మాలధారులు

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటోడ్రైవర్ బోడ హరి కుటుంబానికి అయ్యప్ప మాలధారులు ఆర్థిక సాయం అందించారు. వివరాలిలా ఉన్నాయి.. బోడ హరి గత నెల 24న రోడ్డు ప్రమాదానికి గురై ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ నెల 5న 'ఆపన్న హస్తం అందించండి' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రిక కథనం ప్రచురితమైంది. బుధవారం కోయగూడెం గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులు చీమల రామకృష్ణ (గురుస్వామి), పీఠం మాలధారులు కలిసి రూ.11,300 బాధిత కుటుంబానికి అందజేశారు.

ఫోన్‌లో బెదిరించిన వ్యక్తిపై కేసు

పాల్వంచ: అకారణంగా ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి.. ఈ నెల 10వ తేదీన లక్ష్మీదేవిపల్లికి చెందిన జమ్ముల రాజశేఖర్‌కు ఇందిరాకాలనీకి చెందిన బొడ్డు ఆనంద్ ఫోన్ చేసి అకారణంగా బెదిరింపులకు దిగాడు. అంతేకాకుండా రాజశేఖర్‌ను రెండుసార్లు గుర్తు తెలియని వ్యక్తులు వెంబడించారు. దీంతో ఆనంద్ వల్ల తనకు ప్రాణహాని ఉందని రాజశేఖర్ ఫిర్యాదు చేయడంతో రూరల్ ఏఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లంచం అడిగిన ఆర్‌ఐ

- సోషల్ మీడియాలో వైరల్ అయిన వాయిస్

దమ్మపేట: వ్యవసాయ క్షేత్రంలో బోరు బావి ఉన్నట్లు ధ్రువీకరణ పత్రంపై సంతకం చేయడానికి దమ్మపేట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు లంచం డిమాండ్ చేయగా.. బాధితుడు చేసిన ఆడియో రికార్డ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మండలంలోని మందలపల్లికి చెందిన మడిపల్లి వెంకటేశ్వరరావు మల్లారంలోని మట్టా ధనదుర్గకు చెందిన ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకున్నాడు. ఆ భూమిలో పాత బోరు బావి ఉండగా విద్యుత్ కనెక్షన్ తీసుకునేందుకు ఆర్‌ఐ ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆర్‌ఐ వెంకటేశ్వర్లుకు ఇరవై రోజుల కిందట వెంకటేశ్వరరావు దరఖాస్తు చేసుకోగా రూ.10 వేలు డిమాండ్ చేశాడు. దీంతో రైతు అంత డబ్బు ఇవ్వలేనని బదులివ్వగా రూ.6 వేలైనా ఇవ్వాలని సూచించాడు. ఇదంతా ఫోన్‌లో రికార్డు చేయడంతోపాటు వీడియో చిత్రీకరించగా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బుధవారం ఆర్‌ఐ ధ్రువీకరణ పత్రంపై సంతకం చేసి ఆడియో, వీడియోలు తొలగించాలని కోరాడు. ఈ విషయమై ఆర్‌ఐని వివరణ కోరగా వాయిస్ రికార్డు చేస్తారని అనుకోలేదని, ఏదో అలా జరిగిపోయిందంటూ బదులివ్వడం గమనార్హం. ఇక తహసీల్దార్ ఎండీ.ముజాహిద్ మాట్లాడుతూ ఆర్‌ఐ డబ్బు డిమాండ్ చేసినట్లు తెలిసిందని, రైతు నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

కొత్తగూడెంరూరల్: పాల్వంచకు చెందిన ఆరుగురు వ్యక్తులపై బుధవారం లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సంతోష్ కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండలం మీర్యాల గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు నాలుగు రోజుల కిందట పాల్వంచకు చెందిన ఆరుగురు వ్యక్తుల వద్దకు వచ్చి గొర్రెలు కావాలని అడిగారు. వారు తమ వద్ద లేవని, కావాలంటే గొర్రెలు విక్రయించేవారిని చూపెడుతామని రూ.19 వేలు తీసుకున్నారు. ఈ క్రమంలో వారంతా కలిసి గుప్త నిధుల కోసం లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ అటవీప్రాంతానికి వెళ్లారు. అక్కడ పాల్వంచకు చెందిన వ్యక్తులు తమకు రూ.50 లక్షలు ఇస్తే తిరిగి రూ.2 కోట్లు ఇస్తామని చెప్పడంతో మీర్యాల గ్రామస్తులు రూ.40 లక్షలు చెల్లించారు. దీంతో పాల్వంచకు చెందిన వ్యక్తులు రూ.2 కోట్లు ఉన్నాయని చెప్పి రెండు బస్తాలను వారికి ఇచ్చి పంపించారు. మార్గ మధ్యలోకి వెళ్లిన వారు బస్తాలను తెరిచి చూడగా డబ్బుల కట్టల మధ్యలో కాగితాలు ఉండటంతో మోసపోయామని గుర్తించి లక్ష్మీదేవిపల్లి పోలీసులను ఆశ్రయించారు.

ఎస్‌ఐ సంతోష్ పూర్తి వివరాలు సేకరించి పాల్వంచకు చెందిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. కాగా, ఈ కేసులో ఇంకా విచారణ కొనసాగుతోందని, పూర్తి వివరాలు వెల్లడించలేమని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెనుబల్లి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కుప్పెనకుంట్ల జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. మండలంలోని పాతకారాయిగూడెంకు చెందిన గుగులోతు భీమ్లా – రామలి దంపతులు బుధవారం టీవీఎస్ వాహనంపై కుప్పెనకుంట్ల జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న తమ పిల్లలను చూసేందుకు వెళ్తున్నారు. ఈక్రమంలో వీఎంబంజర్ వైపు నుండి తిరువూరు వెళ్తున్న బుల్లెట్ వాహనం ప్రమాదవశాత్తు వీరిని ఢీకొట్టగా భీమ్లా, రామలి దంపతులతోపాటు బుల్లెట్‌పై ప్రయాణిస్తున్న ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు వీరిని పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా, ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడుతండాకు చెందిన ఇంటర్ విద్యార్థి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన బానోతు అఖిల్(18) కొత్తగూడెం గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చిన అఖిల్ ఈనెల 11న వ్యవసాయ పొలం వద్ద గడ్డి మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై అఖిల్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని పారిశుధ్య కార్మికుడు మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని దానవాయిగూడెం వద్ద రైలు ఢీకొన్న ఘటనలో పారిశుధ్య కార్మికుడు మృతి చెందాడు. జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు కథనం ప్రకారం... దానవాయిగూడెం ప్రాంతానికి చెందిన తోక వెంకన్న (40) డంపింగ్ యార్డులో పనిచేస్తున్నాడు. బుధవారం ఆయన యార్డు నుంచి వెళ్లే క్రమంలో పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో ఆయన మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

రిజర్వాయర్ వద్ద లైట్లలో బ్యాటరీలు చోరీ



ధ్వంసం చేసిన సోలార్ లైట్

వైరా: వైరా రిజర్వాయర్ వద్ద ఏడాది క్రితం ఏర్పాటుచేసిన సోలార్ లైట్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి బ్యాటరీలను చోరీ చేసిన ఘటనపై పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఆనకట్టపై మొత్తం 70 లైట్లు ఏర్పాటుచేయగా, అందులో రూ.5లక్షల విలువైన 25 లైట్ల బ్యాటరీలను చోరీ చేశారని ఐబీ ఏఈ హరికృష్ణ తెలిపారు. రిజర్వాయర్ ఆనకట్టపై పశువుల కాపరులను విచారించగా ముగ్గురు యువకులు ఈ ఘటనకు పాల్పడినట్లు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయంలో చోరీ



కార్యాలయం తలుపును పరిశీలిస్తున్న పోలీసులు

మధిర: మధిరలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. కార్యాలయం వెనక తలుపు తాళాన్ని ఇనుప కడ్డీతో వంచిన లోనకు ప్రవేశించిన దుండగులు టీవీ, బ్యాటరీని ఎత్తుకెళ్లారు. రోజుమాదిరిగానే బుధవారం ఉదయం వచ్చిన ఆఫీస్ కార్యదర్శి రాంబాబు కార్యాలయం తలుపు తెరిచి ఉండడాన్ని గుర్తించగా, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, కనుమూరి వెంకటేశ్వరరావు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

జీపీ కార్యాలయంలో..


రఘునాథపాలెం: మండలంలోని జింకలతండా గ్రామపంచాయతీ కార్యాలయంలో చోరీ జరిగింది. గ్రామ కార్యదర్శి రవి ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేయగా రఘునాథపాలెం ఎస్‌ఐ కొండలరావు వివరాలు వెల్లడించారు. రోజుమాదిరి విధులు ముగించుకున్నాక కార్యాలయానికి మంగళవారం సాయంత్రం తాళం వేసి వెళ్లారు. బుధవారం ఉదయం వచ్చేసరికే కార్యాలయంలోని సర్పంచ్ కుర్చీ, 20 ఎల్‌ఈడీ లైట్లు తదితర సామగ్రి చోరీ జరిగినట్లు గుర్తించిన కార్యదర్శి ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాలపై కేసు..

మండలంలోని పుటానీతండాలో చేతబడి చేశారంటూ ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. ఈ ఘటన ఇటీవల చోటుచేసుకోగా, రెండు వర్గాల వారుపరస్పరం ఇచ్చిన ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

- తృటిలో తప్పిన పెనుప్రమాదం



ఘటనాస్థలంలో ఆర్టీసీ బస్సు

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనగా, ఎవరికీ గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. భద్రాచలం నుంచి నల్లగొండకు బుధవారం వెళ్తున్న ఆర్టీసీ బస్సును నేలకొండపల్లిలో ప్రయాణికుల కోసం ఆపారు. ఇంతలోనే నాగాలాండ్ నుంచి కోదాడ వైపు వెళ్తున్న లారీ బస్సును ఢీకొనగా ఒక్కసారిగా కుదుపు రావడంతో ప్రయాణికులు కేకలు వేశారు. కానీ పెనుప్రమాదం తప్పిందని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్తుండడంతో, బస్సు డ్రైవర్ స్థానికుడి బైక్‌పై వెంబడించి లారీని పోలీసుస్టేషన్ వద్ద అడ్డుకున్నాడు.

ఆరు లేన్లు అయ్యేనా?

- 65 నంబర్ జాతీయ రహదారి విస్తరణపై మంత్రి కోమటిరెడ్డి ప్రకటన
- విస్తరణ పూర్తయితే రెండున్నర గంటల్లోనే హైదరాబాద్ నుంచి విజయవాడకు


ఆరు వరుసలుగా మార్చాల్సిన జాతీయ రహదారి ఇదే

చౌటుప్పల్: త్వరలో హైవే విస్తరణకు చర్యలు తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల ప్రకటన చేశారు. దీంతో హైదరాబాద్- విజయవాడ 65వ నంబరు జాతీయరహదారి ఆరు లేన్ల విస్తరణకు మోక్షం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం రెండున్నర గంటల్లోనే చేరుకోవచ్చు. మంత్రి ప్రకటనతో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన వాహనదారులు, ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

బీఓటీ పద్ధతిన నాలుగు లేన్లుగా విస్తరణ

హైదరాబాద్ - విజయవాడ మధ్య 275 కిలోమీటర్ల దూరం ఉంది. ఇందులో హైదరాబాద్ నుంచి యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వరకు, ఏపీలోని విజయవాడ నుంచి నందిగామ వరకు నాలుగు లేన్ల రోడ్డుగా వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో విస్తరించారు. మిగిలిన 180 కిలోమీటర్లు మాత్రం బీఓటీ పద్ధతిన నాలుగులేన్లుగా నిర్మించారు. ఈ పనులను జీఎంఆర్ సంస్థ చేపట్టింది. ఈ పనులకు అప్పటి సీఎం రోశయ్య 2010 మార్చిలో నార్కట్‌పల్లి వద్ద శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చేసి మూడు ప్రాంతాల్లో టోల్‌ప్లాజాల వద్ద టోల్ రుసుము వసూలు చేస్తోంది.

కోర్టును ఆశ్రయించిన జీఎంఆర్ సంస్థ

ఈ హైవేను ఆరులేన్లుగా విస్తరించాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఎంపీలుగా ప్రాతినిధ్యం వహించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ఎప్పటికప్పుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తీసుకొచ్చారు. అయితే హైవే విస్తరణ పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ జీఎంఆర్ ముందస్తుగా కోర్టును ఆశ్రయించింది. తాము బీఓటీ పద్ధతిలో రోడ్డు నిర్మాణ పనులు చేశామని, టోల్ వసూలు చేసుకునేందుకు తమకు ఇంకా గడువు ఉందని, పెట్టుబడి కింద టోల్ వసూళ్లు అనుకున్న మేరకు రానందున మరికొంత కాలం అనుమతి ఇప్పించాలని కోర్టుకు వెళ్లింది. దీంతో విస్తరణ ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది.

అత్యంత రద్దీ రహదారిగా గుర్తింపు

హైదరాబాద్- విజయవాడ హైవే దేశంలోనే అత్యంత రద్దీ రహదారిగా గుర్తింపు పొందింది. టోల్‌ప్లాజాల లెక్కల ప్రకారం రోజూ సగటున 40వేల నుంచి 50వేల వాహనాలు ఈ మార్గంలో వెళుతున్నాయి. దీనిపై ఏ చిన్నపాటి ప్రమాదం జరిగినా గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది.

అన్ని విధాలుగా ప్రయోజనం



హైవేను ఆరు వరుసలుగా విస్తరిస్తే ప్రమాదాలు చాలా వరకు తగ్గుతాయి. వాహనదారులు, ప్రయాణికులకు సమయం కూడా కలిసివస్తుంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఆశిస్తున్నాం.

- చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, చౌటుప్పల్ జెడ్పీటీసీ సభ్యుడు

సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలి



ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న హైవేపై నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. దీనిని తగ్గించడానికి ఆరు వరుసలు అవసరం. విస్తరణతోపాటు హైవే వెంట ఉన్న అన్ని గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు నిర్మించాలి.

- బాతరాజు సత్యం, పంతంగి సర్పంచ్


ఈ నెల 12న పశువుల కాపరిపై దాడి చేసిన ఆడపులి (ఫైల్)

పులి భయం మళ్లీ మొదలైంది. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం నందిగూడ అటవీ ప్రాంత శివారులో రెండురోజుల కిందట పశువును చంపేసి.. పశువుల కాపరి గులాబ్‌పై దాడి చేసిన ఘటన దరిమిలా ఆ ప్రాంత సమీప ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఆ ఘటనలో గులాబ్ అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణాలతో బయటపడగా, చేతికి గాయాలయ్యాయి. ప్రతీ ఏడాది పత్తి తీసే ఇదే సీజన్‌లోనే పులుల సంచారం పెరుగుతోంది. దీంతో పత్తి చేన్లకు వెళ్లాలన్నా, జీవాలను మేతకు తీసుకెళ్లాలన్నా కాపర్లు జంకుతున్నారు.

- సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

మళ్లీ పులి భయం

ఏటా ఇదే సీజన్‌లో భయపెడుతున్న టైగర్	నందిగూడ శివారులో పశువును చంపి.. కాపరిపై దాడి	పత్తి చేన్లకు వెళ్లాలంటే జంకుతున్న స్థానికులు	అటవీ సమీప ప్రాంతాల వరకు పులి సంచారం

మూడేళ్లుగా మనుషులపై దాడులు

గత మూడేళ్లుగా నవంబర్ నుంచి జనవరి మధ్యే పులుల దాడులు అధికంగా ఉంటున్నాయి. రాష్ట్రంలో తొలిసారిగా 2020 నవంబర్ 11న ఏ2 అనే పులి కుమురంభీం జిల్లా దహెగాం మండలం దిగిడకు చెందిన సిడాం విగ్నేశ్(21) పత్తి చేనుకు వెళ్తుండగా దాడి చేసి చంపేసింది. అదే నెల 29న పెంచికల్‌పేట మండలం కొండపల్లికి చెందిన పసుల నిర్మల(18)ను పొట్టన పెట్టుకుంది. కేవలం మూడు వారాల వ్యవధిలోనే ఇద్దరి మృతితో స్థానికుల నుంచి నిరసనలు వచ్చాయి. దాంతో అటవీ శాఖ సీరియస్‌గా తీసుకుని ఆ పులిని బంధించే ప్రయత్నం చేసినా.. సాధ్యపడలేదు. ఆ తర్వాత పులి మహారాష్ట్ర వైపు వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ గతేడాది నవంబర్‌లోనే కుమురంభీం జిల్లా వాంకిడి మండలం ఖానాపూర్‌కు చెందిన రైతు సిడాం భీము(69)ను పత్తి చేనులో ఉండగా దాడి చేసి చంపేసింది. తాజాగా పశువుల కాపరిపై దాడి జరిగింది.

జత కట్టే సమయంలో?

పులులు జత కట్టే సమయం నవంబర్ నుంచి ఏప్రిల్ మధ్యే కావడం, తోడు, ఆవాసం కోసం తోటి పులుల మధ్య ఆధిపత్య పోరు, వాగులు, నదులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఉన్న చోట సంచరిస్తూ అనుకోకుండా మనుషులు ఎదురుపడితే దాడులకు ప్రధాన కారణమవుతున్నాయని అటవీశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు.. పులుల రాకపోకలకు ప్రధాన కారిడార్‌గా ఉంది. ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్, మంచిర్యాల వరకు పులుల సంచారం ఉంటోంది. పెన్‌గంగా, ప్రాణహిత తీరాలు దాటి తిప్పేశ్వర్, తడోబా టైగర్ రిజర్వ్ పులుల అభయారణ్యాల నుంచి వలస వస్తుంటాయి. ఎనిమిదేళ్ల క్రితం పాల్గుణ అనే ఆడపులి కాగజ్‌నగర్‌లోనే స్థిర నివాసం ఉండటంతో సంతతి పెరిగింది. ఇలా అనేక పులులు ఒక్కొక్కటిగా తెలంగాణ భూభాగంలో ఆవాసం, తోడు వెతుక్కుంటూ అడుగుపెడుతున్నాయి. టైగర్ రిజర్వు పరిధి కోర్ ఏరియా మంచిర్యాల జిల్లా జన్నారం డివిజన్ కవ్వాల్‌లో మాత్రం ఇప్పటికీ ఒక్క పులి కూడా స్థిరంగా ఉండలేదు. కేవలం బఫర్ ప్రాంతాల్లోనే పులులు సంచరించడంతో సమస్య మొదలవుతోంది. ఆ ప్రాంతాల్లోనే పత్తి చేన్లు, మానవ సంచారం ఉండడంతో ఎదురుపడిన సందర్భంలో దాడి చేస్తున్నాయి.

బఫర్ జోన్‌లోనే సంచారం

నిత్యం ఆదిలాబాద్ డివిజన్‌లో తాంసి, భీంపూర్, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్‌లో దహెగాం, పెంచికల్‌పేట, బెజ్జూరు, బెల్లంపల్లి, చెన్నూరు డివిజన్ల వరకు పులులు తిరుగుతుంటాయి. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు పిప్పల్‌కోట్, కాగజ్‌నగర్ డివిజన్ అడవుల్లో అనేకసార్లు స్థానికులకు పులులు ఎదురుపడ్డాయి. అడవిలో వన్యప్రాణుల కంటే సులువుగా దొరికే మేతకు వెళ్లిన పశువులు, మేకలు, గొర్రెల పైనే దాడి చేస్తూ ఆకలి తీర్చుకుంటున్నాయి. అలా పశువులు నష్టపోయిన రైతులకు పరిహారం కూడా అటవీ శాఖ చెల్లిస్తోంది. అయితే ఇప్పుడు మనుషులపై దాడి చేయడమే ఆందోళన కలిగిస్తోంది.

పులుల కదలికలు పెరిగిన చోట్ల ప్రజలను అప్రమత్తం చేయండి

క్షేత్రస్థాయి అధికారులకు అటవీశాఖ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పులుల కదలికలు పెరిగి, కొన్నిచోట్ల మనుషులతో ఘర్షణ పూరిత వాతావరణానికి పరిస్థితులు దారితీస్తుండటంతో క్షేత్రస్థాయి అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ సూచించింది. ముఖ్యంగా అడవులకు ఆనుకుని ఉన్న గ్రామాలు, పులుల సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. మంగళవారం కుమురంభీం జిల్లాలో పశువుల కాపరిపై పెద్దపులి దాడి ఘటన, కొల్లాపూర్ సర్కిల్ పరిధిలో మరో పులి కనబడడం, మహారాష్ట్ర- ఆదిలాబాద్ టైగర్ కారిడార్ పరిధిలో పులుల కదలికలు పెరగడం వంటి ఘటనల నేపథ్యంలో ఆయా అంశాలు చర్చకు వచ్చాయి. పులులు లేదా అడవి జంతువుల దాడుల్లో పశువులు, ఇతర ఆస్తులకు నష్టం జరిగితే వెంటనే పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని శాఖ అధికారులను అటవీశాఖ ఆదేశించింది. ఒకవేళ పులుల దాడిలో మనిషి చనిపోతే రూ. 5 లక్షల పరిహారం, గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చును అటవీశాఖ భరిస్తోంది. బుధవారం అరణ్యభవన్‌లో పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ అధ్యక్షతన జరిగిన సమీక్షలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, జోగుళాంబ సర్కిల్‌లో చేపట్టిన, వచ్చే ఏడాది చేపట్టబోయే కార్యకలాపాలపై చర్చించినట్టు తెలిసింది. వచ్చే ఏడాది...అటవీ శాఖ పరంగా అనుసరించాల్సిన ప్రణాళికలు- చేపట్టాల్సిన కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. 2024లో చేపట్టాల్సిన పథకాలు, వాటికయ్యే వ్యయం తదితరాలపై వార్షిక బడ్జెట్‌లో భాగంగా... శాఖకు సంబంధించి అందుబాటులో నిధులు, వాటి వినియోగం వంటి అంశాలపై చర్చించారు.





ఘనంగా భారత నావికా దళ వారోత్సవాలు

సాక్షి, హైదరాబాద్: భారత నావికాదళం వారోత్సవాల్లో భాగంగా బుధవారం సికింద్రాబాద్‌లో నావికా దళానికి చెందిన బ్యాండ్ విభాగం ఉత్సవాలు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నావికాదళ విజయాలను తెలిపే పలు బ్యానర్లను ఈ సందర్భంగా ప్రదర్శించారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత్ సాధించిన విజయాన్ని గుర్తుచేస్తూ ఏటా ఈ వారోత్సవాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో కమాండర్ మనోజ్ సెబాస్టియన్, అసిస్టెంట్ ప్రిన్సిపల్ కమాండర్ జే పద్మనాభన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

నాణ్యమైన సామగ్రి సరఫరా చేయాలి


టెండర్లు ఖరారు చేస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు కాంట్రాక్టర్లు నాణ్యమైన సామగ్రి సరఫరా చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ముద్రించి ఇవ్వడానికి టెండర్లు ఆహ్వానించగా బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలించి ఖరారు చేశారు. ఈ సందర్భంగా పీఓ వారికి నిబంధనలు వివరించారు. డీడీ మణెమ్మ, అధికారులు రమణయ్య, పి.నర్సింహారావు, ప్రమీలాబాయి తదితరులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు

ఖమ్మంమామిళ్లగూడెం: వరంగల్ సమీపాన జరుగుతున్న మూడో రైల్వేలైన్ నిర్మాణ పనుల కారణంగా విజయవాడ నుంచి ఖమ్మం మీదుగా నడిచే పలు ప్యాసింజర్ రైళ్లు రద్దు చేశారు. గతంలోనే ఈ రైళ్లను రద్దు చేయగా మరికొంత కాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఖమ్మం సీసీఐ జాఫర్ తెలిపారు. ఈ మేరకు డోర్నకల్- విజయవాడ (07755), విజయవాడ-డోర్నకల్ (07756), భద్రాచలం రోడ్-విజయవాడ (07278), విజయవాడ-భద్రాచలంరోడ్ (07279) ప్యాసింజర్ రైళ్లు ఈ నెల 31 వరకు నడవవని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని సీసీఐ కోరారు.

'స్ట్రాంగ్ ఉమెన్'గా అనూష



ట్రోఫీ అందుకుంటున్న అనూష

ఖమ్మంస్పోర్ట్స్: రాజమహేంద్రిలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగిన సౌత్, వెస్ట్ రాష్ట్రాల స్థాయి యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఖమ్మం కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎం.అనూష సత్తా చాటింది. ఆమె స్వర్ణపతకం సాధించి ఆల్ ఇండియా యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించగా, టోర్నీలో పాల్గొన్న అందరి కంటే అత్యధిక బరువులు ఎత్తడంతో స్ట్రాంగ్ ఉమెన్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అనూషను కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ కోటా అప్పిరెడ్డి, చైర్మన్ ఎం.నిరంజన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రమణారావు, కోచ్ డి.వినోద్‌కుమార్ అభినందనలు తెలిపారు.

మిర్చి కళకళ.. పత్తి విలవిల


ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి


విక్రయానికి వచ్చిన పత్తి

- క్వింటా రూ.24 వేలు పలుకుతున్న కొత్త మిర్చి
- రూ.6,600కు మించని పత్తి ధర
- పంటలు చేతికొస్తుండటంతో పెరుగుతున్న విక్రయాలు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర కళకళలాడుతుండగా.. పత్తి ధర మాత్రం వెలవెలబోతోంది. పత్తి సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తుండగా, మిర్చి సీజన్ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. రెండేళ్లుగా మిర్చి ధరలు కొంత మేరకు అనుకూలంగానే కొనసాగుతున్నాయి. పత్తి ధరలు మాత్రం గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది గణనీయంగా తగ్గాయి. ప్రకృతి సహకరించకపోగా పంటల సాగు విస్తీర్ణం తగ్గిన నేపథ్యాన, దిగుబడి పడిపోయింది. దీనికి తోడు ధరలు కూడా ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 3.85 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, మిర్చి 1.45 లక్షల ఎకరాల్లో సాగైంది. పత్తి సాగు విస్తీర్ణం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎక్కువగా ఉండగా, మిర్చి సాగు విస్తీర్ణం మాత్రం ఖమ్మం జిల్లాలోనే అధికంగా ఉంది.

నిల్వ మిర్చి.. కొత్త మిర్చి

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చికి డిమాండ్ ధర పలుకుతోంది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చితో పాటు, గత ఏడాది పండించి ఇళ్లలో నిల్వ పెట్టిన మిర్చిని విక్రయానికి తీసుకొస్తున్నారు. దీనికి తోడు ఈ ఏడాది సాగు చేసిన రైతులు తొలి కోత (మైల కాయ) తీసుకొస్తుండగా ధర మంచిగానే వస్తోంది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ పెట్టిన మిర్చి ధరకు సమాంతరంగా మైల కాయ ధర పలుకుతోంది. కొత్త మిర్చి ధర క్వింటాకు రూ.24 వేలు ఉండగా, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చికి రూ.19,500 నుంచి రూ.24,300 ధర లభిస్తోంది. గత ఏడాది పండించి ఇళ్లలో నిల్వ చేసిన మిర్చికి రూ.18 వేల నుంచి రూ.23 వేలు చెల్లిస్తున్నారు. ఇదే సమయాన కొత్త మిర్చికి రూ.24 వేల ధర పలుకుతుండటంతో రైతులు విక్రయానికే మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది సీజన్ ఆరంభంలో రూ.18 వేల ధరపలకగా.. ఈసారి అంతకు మించి వస్తుండటం విశేషం.

డిమాండ్ ఉండటంతోనే..

మిర్చికి అంతర్జాతీయంగా, జాతీయంగా డిమాండ్ ఉంది. ఇక్కడ పండించే తేజా రకం మిర్చికి విదేశాల్లో డిమాండ్ ఉన్న కారణంగా వ్యాపారులు చైనా, మలేషియా, సింగపూర్, బంగ్లాదేశ్ వంటి దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఆర్డర్లు ఉన్నా ఆశించిన మేర సరుకు లేకపోవడంతో మెరుగైన ధర లభిస్తోందని సమాచారం. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు నిత్యం 7 వేల నుంచి 8 వేల బస్తాల మిర్చి విక్రయానికి వస్తోంది.

పత్తికి అంతా ప్రతికూలమే

ఈ ఏడాది పత్తి పంటకు ఆది నుంచి ప్రతికూల పరిస్థితులే ఎదురవుతున్నాయి. వర్షాభావ పరిస్థితులతో సీజన్ మొదట్లో ఇబ్బందులు ఉండగా, దిగుబడి కూడా అంతంత మాత్రంగానే వస్తోంది. గత ఏడాది ఓ దశలో క్వింటా పత్తి ధర రూ.13 వేల వరకు పలికినా సీజన్ ముగిసే నాటికి రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు వచ్చింది. అయితే, రైతులు ధర మరింతగా పెరుగుతుందనే భావనతో ఇళ్లలో నిల్వ చేశారు. ఇక ఈ ఏడాది సీజన్‌కు ముందే ధర పతనమైంది. ఆగస్టులో రూ.7,600 వరకు పలకగా, సెప్టెంబర్‌లో రూ.7,300కు తగ్గింది. అక్టోబర్ నుంచి కొత్త పత్తి సీజన్ ప్రారంభమైతే క్వింటాకు రూ.6,900 వరకు పలికి ధర నవంబర్‌లో ఏకంగా రూ.6,500కు పడిపోయింది. ప్రస్తుతం గరిష్ఠంగా రూ.6,500 వరకు ధర చెబుతున్నా.. వర్షాలతో పంట నాణ్యత కోల్పోయినందున రూ.5,500కు మించి చెల్లించడం లేదు. ఈ ఏడాది సీసీఐ ద్వారా పత్తికి మద్దతు ధరగా రూ.7,020 నిర్ణయించారు. పత్తికి అంతర్జాతీయంగా, జాతీయంగా డిమాండ్ తగ్గటంతో ధర పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

మిర్చి రూ.24 వేల చొప్పున విక్రయించా



మిర్చి క్వింటాకు రూ.24 వేలు వచ్చాయి. గత ఏడాది నాలుగెకరాల్లో సాగు చేస్తే 102 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసి విడతల వారీగా విక్రయిస్తున్నా. ఈ ఏడాది కూడా నాలుగెకరాల్లో సాగు చేశా. కొత్త మిర్చికి కూడా రూ.24 వేల ధర వస్తోంది.

-వేల్పుల రామయ్య, ఖమ్మం రూరల్ మండలం

పత్తి ధర దయనీయం



గత ఏడాది పండించిన పత్తిని ఇంటి వద్ద రూ.10 వేలకు అడిగితే ఇంకా ధర పెరుగుతుందని అమ్మలేదు. ఇప్పుడు మార్కెట్‌కు వస్తే రూ.6,500లే ఇచ్చారు. ఈ ఏడాది నాలుగెకరాల్లో పత్తి సాగు చేసినా దిగుబడి రాలేదు. వానలతో పంట నాణ్యత కూడా కోల్పోయింది.

-ఓరుగంటి వీరమల్లు, రఘునాథపాలెం మండలం

మరింత సమర్థవంతంగా 'తొలిమెట్టు'

రాష్ట్ర మానిటరింగ్ అధికారుల సూచన


మాట్లాడుతున్న రాష్ట్ర మానిటరింగ్ అధికారి రవికాంత్, పక్కన రమేశ్‌రావు, డీఈఓ తదితరులు


తిరుమలాయపాలెంలో విద్యార్థి సామర్థ్యాలను పరీక్షిస్తున్న రమేశ్‌రావు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం జిల్లాలో తొలిమెట్టు కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర మానిటరింగ్ అధికారులు ప్రొఫెసర్ రవికాంత్, ప్రొఫెసర్ రమేశ్‌రావు సూచించారు. ఖమ్మంలోని రిక్కాబజార్ పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంపై బుధవారం వారు సమీక్షించారు. తొలిమెట్టు కార్యక్రమం అమలు సంతృప్తిగానే ఉన్నప్పటికీ మరింత మెరుగుపడాల్సిన అవసరముందని తెలిపారు. జిల్లాలోని చింతకాని, కామేపల్లి, కొణిజర్ల, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో తాము పర్యటించి వివరాలు ఆరా తీసినట్లు చెప్పారు. సమావేశంలో డీఈఓ సోమశేఖరశర్మ, ఏఎంఓ రవికుమార్, హెచ్‌ఎంలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో కీలకం

కూసుమంచి/తిరుమలాయపాలెం/కారేపల్లి: విద్యాభివృద్ధిలో తొలిమెట్టు, ఉన్నతి కీలకపాత్ర పోషిస్తాయని ప్రొఫెసర్ రమేశ్‌రావు తెలిపారు. కూసుమంచి, తిరుమలాయపాలెంలోని కేజీబీవీలు, పలు పాఠశాలలను రమేశ్‌రావు ఆధ్వర్యాన సందర్శించిన బృందం తొలిమెట్టు, ఉన్నతి అమలుపై పరిశీలించి ఉపాధ్యాయుల బోధనతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. డీఈఓ సోమశేఖరశర్మ, బృందం సభ్యులు వైజీకే మూర్తి, సీతారామారావు, అనిల్‌కుమార్, ఎంఈఓ బీవీ రామాచారి పాల్గొన్నారు. కాగా, కారేపల్లిలోని కేజీబీవీని ప్రొఫెసర్ రవికాంత్ ఆధ్వర్యాన బృందం సందర్శించి తొలిమెట్టు, ఉన్నతి అమలుపై ఆరా తీశారు. కార్యక్రమంలో బృందం సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జగదీశ్, ఎంఈఓ జయరాజు, కేజీబీవీ ఎస్‌ఓ ఝాన్సీసౌజన్య పాల్గొన్నారు.

కేసీఆర్‌కు మంత్రి తుమ్మల, ఎంపీ రవిచంద్ర పరామర్శ


మంత్రి కోమటిరెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల


కేసీఆర్‌ను పరామర్శిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంవన్‌టౌన్: హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడిన ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కూడా యశోద ఆస్పత్రిలో మంగళవారం రాత్రి కేసీఆర్‌ను పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజాసేవకు పునరంకితం కావాలని ఆకాంక్షించారు. కాగా, పార్లమెంట్‌పై తీవ్రవాదులు 2001 డిసెంబర్ 13న దాడి చేయగా, ఘటనలో అసువులు బాసిన అమరవీరులకు ఎంపీ రవిచంద్ర బుధవారం నివాళులర్పించారు. అమరవీరులను స్మరించుకుంటూ పార్లమెంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

బాంబు దాడి సమస్యలకు పరిష్కారం కాదు

ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: లోక్‌సభలోకి ప్రవేశించిన పలువురు పొగ సెల్స్‌తో దాడి చేయడం, రాజ్యాంగాన్ని రక్షించండి, నిరంకుశత్వం, నియంతృత్వం నశించాలనే నినాదాలు చేయడం సమస్యలకు పరిష్కారమార్గం కాదని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయాన ఆగంతకులు ప్రవేశించడం భద్రతా వైఫల్యమేనని, ఘటనపై విచారణ జరిపి భద్రతా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పార్లమెంట్‌లో 370 ఆర్టికల్ రద్దుతో పాటు మనువాద, ఫాసిస్టు చట్టాలను కేంద్ర ప్రభుత్వం యథేచ్ఛగా చేసుకుపోతోందని తెలిపారు.

370 ఆర్టికల్ రద్దు, కశ్మీర్‌ను రెండు ముక్కలుగా విడగొట్టడంపై చివరి ఆశగా ఉన్న ఉన్నత న్యాయస్థానం సైతం ప్రజాస్వామిక, ఫెడరల్ విలువలను గుర్తించలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం మారి మనువాద రాజ్యాంగం రాబోతోందన్న ఆందోళనతోనే పార్లమెంట్‌లోకి ఆగంతకులు ప్రవేశించడం వంటి ఘటనలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. నాడు భగత్‌సింగ్, భటుకేశ్వర దత్తు బ్రిటీష్ నల్లచట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ప్రమాదరహిత పొగ బాంబులు వేస్తే.. నేడు అదే పద్ధతి కనిపిస్తోందని రంగారావు వివరించారు.